# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-05-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశ ప్రజలంతా భారత సైనిక దళాల పరాక్రమం చూశారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.**
2. **భారతదేశం అభివృద్ధి చెందుతుంటే పాకిస్థాన్ చూసి ఓర్వలేకపోతోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.**
3. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు నగరంలో పర్యటించనున్నారు.**
4. **భవిష్యత్తు అవసరాలకు సరిపోయే విధంగా విద్యుత్ ఉత్పత్తి, సరఫరాకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు.**
5. **ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో పయనిస్తోందని కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న కొనియాడారు.**

==========================

దేశ ప్రజలంతా భారత సైనిక దళాల పరాక్రమం చూశారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా దేశ సైనికులకు మద్దతుగా విజయవాడలో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు ర్యాలీ సాగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్, బీజేపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు, ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...

..వాయిస్ .. 35 సెకన్లు...

భారతదేశం అభివృద్ధి చెందుతుంటే పాకిస్థాన్ చూసి ఓర్వలేకపోతోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అన్నారు. ఇంత ప్రశాంతంగా మనం ఉన్నామంటే బోర్డర్‌లో దేశాన్ని కాపాడుతున్న సైనికుల వల్లే అది సాధ్యమవుతోందని తెలిపారు. దేశం కోసం పోరాడిన మురళీనాయక్ లాంటి సైనికులు దేశానికి నిజమైన నాయకులని ఆయన వెల్లడిస్తూ...

..వాయిస్ .. 30 సెకన్లు...

--------------------------

దేశ సైనికులకు, ఆపరేషన్ సిందూర్ కు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా కూటమి నేతలు తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తిరంగా ర్యాలీలో పాల్గొన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ జరిగింది. యువకులు జాతీయ జెండాలు చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కూటమి నేతలు ర్యాలీ చేశారు. ఎన్ టి ఆర్ కూడలి నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. శాసన సభ్యులు షాజహాన్ బాషా ర్యాలీలో పాల్గొన్నారు. సరిహద్దుల్లో జరిగిన కాల్పుల్లో వీరమరణం పొందిన మురళీనాయక్ చిత్రపటాన్ని ర్యాలీలో ప్రదర్శించారు.

---------------------------

భారత్‌పై దాడి చేస్తే ప్రతిదాడి ఎలా ఉంటుందో ఆపరేషన్ సిందూర్ ద్వారా నిరూపించామని కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి చెప్పారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ..... ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో ఈరోజు సాయంత్రం ట్యాంక్‌బండ్ వద్ద తిరంగా యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ తిరంగా యాత్రలో శాసన సభ్యులు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కిషన్‌రెడ్డి పిలుపునిస్తూ...

...వాయిస్.. 30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు కర్నూలులో పర్యటిస్తారు. నగరంలోని సి.క్యాంపు రైతుబజారుకు చేరుకొని.. అక్కడ రైతులు, పారిశుద్ధ్య కార్మికులతో ముఖాముఖి నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు నంద్యాల చెక్‌పోస్టు కేంద్రీయ విద్యాలయం వద్ద ధనలక్ష్మి నగర్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పార్కు -ఎస్ఏఎస్ఏ పార్క్‌కు శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఒంటి గంటకు ప్రజావేదికలో ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి కర్నూలు నగర ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు.

---------------------------

భవిష్యత్తు అవసరాలకు సరిపోయే విధంగా విద్యుత్ ఉత్పత్తి, సరఫరాకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. విద్యుత్‌శాఖపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... భవిష్యత్‌లో డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్ మారబోతోందని.... విద్యుత్ లైన్ల ఆధునికీకరణపై దృష్టి సారించాలన్నారు. ఓఆర్ఆర్‌లో సౌర విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేయాలనిఅధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో పయనిస్తోందని... కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న కొనియాడారు. అనంతపురం రైల్వే స్టేషన్‌ను... నిన్న ఆయన తనిఖీ చేశారు. అమృత్ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణతో కలిసి పరిశీలించారు. అనంతపురం రైల్వే స్టేషన్ అభివృద్ధికి 30 కోట్ల రూపాయల నిధులు కేటాయించినట్లు కేంద్రమంత్రి చెప్పారు. బెంగళూరుకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలియజేస్తూ...

..వాయిస్.. 32 సెకన్లు

---------------------------

భూభారతి చట్టం ద్వారా రైతులకు భూహక్కులతో పాటు భరోసా కల్పిస్తున్నామని తెలంగాణ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. నిర్మల్ జిల్లా కుంటాలలో భూభారతి చట్టంపై నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ – సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. తెలంగాణలోనే కాకుండా దేశ వ్యాప్తంగా భూ భారతి చట్టం మోడల్‌గా తీసుకునే విధంగా ఉంటుందన్నారు. ప్రతి భూ సమస్యను పరిష్కారించే విధంగా భూ భారతి చట్టం రూపొందించామని మంత్రి వివరిస్తూ...

...వాయిస్ .. 35 సెకన్లు

----------------------------

తెలంగాణలోని పర్యాటక ప్రాంతాల్లో మిస్ వరల్డ్ పోటీదారుల యాత్ర కొనసాగుతోంది. మహబూబ్ నగర్ జిల్లా పిల్లలమర్రికి వెళ్లిన సుందరీమణులు.. ప్రకృతి రమణీయతకు ప్రతీకగా నిలుస్తున్న మహావృక్షం వివరాలను తెలుసుకున్నారు. హైదరాబాద్ శివారులోని ఎకో టూరిజం పార్కులో సందడి చేశారు. గచ్చిబౌలి ఎఐజి ఆసుపత్రికి వెళ్లిన మరో బృందం.. అక్కడి అధునాతన చికిత్స వివరాలు తెలుసుకుంది.

----------------------------

నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్ర, దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో రాగల 24 గంటల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే... అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని వెల్లడించింది. మరోవైపు తెలంగాణలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================